**కథ**

# అమ్మకం

**సమయం ఉదయం 8 గంటలు.**

**'అభీ' అన్న పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు అభిజిత్. అంతకు ముందురోజే వచ్చిన ఇంటర్ ఫలితాల్లో తను కాలేజ్ ఫస్ట్ రావడంతో పొద్దెక్కిందాక పడుకొని తాను గొప్పవాడు అయినట్లు కలలు కంటున్న అభికి ఆ పిలుపుతో చాలా విసుగొచ్చింది.**

''ఊ'' అంటూనే ముసుగేశాడు. కానీ అరుంధతికి విక్రమార్కుని పోలికలుండటంతో అభికి లేవక తప్పలేదు.

''ఏంటమ్మా?'' అన్నాడు కాస్త విసుగ్గానే.

''పాలవాడు రాలేదు. కాస్త బజారుకెళ్ళి పాల ప్యాకెట్ తీసుకురామ్మా'' సమాధానంతోపాటే చేతికి సంచి, జేబులోకి పది రూపాయలు వచ్చి చేరాయి. అభి లేచి చెప్పులేసుకుని బయటకు నడిచాడు. పాలప్యాకెట్ దొరికే చోటుకు వెళ్లాలంటే మార్కెట్‌లో నుంచే వెళ్లాలి. ఎప్పటిలాగే బాగా రద్దీగా వుంది ఆ మార్కెట్. పళ్లు, కూరగాయలు తాజాగా దొరికే మార్కెట్ కావడంతో ఉదయంనుండే బాగా రద్దీ అలముకుంటుంది అక్కడ.

జనాలను నెట్టుకుంటూ వెళుతున్నాడు అభి. నిద్ర చెడిపోవడంతో మొదలైన విసుగు ఇక్కడి రద్దీ వల్ల రెట్టింపైంది. కొంచెం దూరం వెళ్లేసరికి ఇక వాడివల్ల కాలేదు. 'కాస్త రద్దీ తగ్గాక వెళదాం' అనుకొని కాస్త పక్కకు జరిగి నిల్చున్నాడు. ఇంతలో నెత్తిన మూట వేసుకుని హడావుడిగా వచ్చిన ఓ వ్యక్తి ''జరుగు'' అన్నాడు కాస్తంత విసురుతో. అసలే విసుగ్గా వున్న అభి, దీంతో-

''పోవోయ్, ఈ స్థలం నేను కొన్నాను'' అన్నాడు అంతకంటే విసురుగా. అందుకు ఆ మనిషి ఏదైనా గొడవ పడతాడేమోనని ఊహించిన అభి ''అలాగా'' అని వెళ్లిపోవడంతో ఆశ్చర్యంలో మునిగిపోయాడు.

'అదేంటి, అతనలా వెళ్లిపోయాడు. నిజంగానే కొన్నాననుకున్నాడా, అమాయకుడు' అనుకొని జాలిపడ్డాడు. పట్టణం నడిబొడ్డున వున్న ఈ మార్కెట్ తనదే అయితే పెద్ద ఇల్లు కట్టించుకోవచ్చు' అనుకుంటూ ఊహల్లో దూరాడు.

''బాబూ, ఈ స్థలంతో నీకేం పని'' పక్కన బత్తాయిపళ్లు అమ్మే వ్యక్తి అడిగాడు.

''పెద్ద ఇల్లు కట్టుకుంటాను''

అందుకు ఆ వ్యక్తి నవ్వి ''మూడడుగుల వెడల్పు, నాలుగడుగుల పొడవు వున్న స్థలంలో ఎంత పెద్ద ఇల్లుకడతావో'' వ్యంగ్యం ధ్వనించేలా ప్రశ్నించాడు.

''ఏంటీ, నాలుగు అడుగుల పొడవా'' ప్రశ్నించాడు అభి.

''అవును బాబూ, ఈ మార్కెట్‌లో ఏదయినా అమ్ముకోవాలంటే ఇక్కడ కొంత స్థలం కొనుక్కోవాలి. అది కూడా ఒక రోజుకు మాత్రమే. రోజుకు పది రూపాయలు కడితే ఉదయం నుండి సాయంత్రం వరకు ఏదైనా అమ్ముకోవచ్చు'' వివరించాడు ఆ ఆసామి. ఇంతలో నీలం రంగు లాల్చీ పైజమా వేసుకొన్న ఒక వ్యక్తి వచ్చి పది రూపాయలకు రశీదు రాసి అభి చేతిలో పెట్టాడు. ఇంతకుముందు మూట వేసుకున్న వ్యక్తి ఇతనికి చెప్పి వుంటాడు అనుకున్నాడు. తప్పనిసరి పరిస్థితుల్లో జేబులో వున్న పది రూపాయలను అతని చేతిలో పెట్టాడు.

ఆ వ్యక్తి నిలువెత్తు త్రిశూలాన్ని అభి చేతిలో పెట్టి ''సాయంత్రం ఆరుగంటలకల్లా ఖాళీ చేయాలి'' అని చెప్పాడు. తనంత ఎత్తున్న ఆ త్రిశూలాన్ని అన్యమనస్కంగానే అందుకున్నాడు అభి. అప్పటికిగాని తన చుట్టూ జరుగుతుంది ఏమిటో అర్థం కాలేదు.

''ఎవరైనా కొత్తగా వ్యాపారం ప్రారంభించే ముందు ఈ త్రిశూలాన్ని ఇవ్వడం ఇక్కడి ఆచారం బాబూ. అమ్మవారి అంశ అయిన ఈ త్రిశూలం చాలా మేలు చేస్తుందని ఇక్కడి వారు నమ్ముతారు'' అనే మాటలు చెవిన పడుతుండగా ఆ త్రిశూలాన్ని బలంగా నేలలోకి గుచ్చాడు అభి.

★ ★ ★

''పాల ప్యాకెట్ ఏది అభి'' ఇంట్లో అడుగుపెడుతుండగానే అరుంధతి అడిగింది.

''కొనలేదమ్మా''

''మరి?''

''మార్కెట్లో స్థలం కొన్నాను'' అంటూ పెద్దగా నవ్వేశాడు అభి.

''మార్కెట్లో స్థలం కొనడమేమిటరా? నిద్ర మత్తు ఇంకా వదల్లేదా'' ఆమె ముఖంలో ఇంకా ఆశ్చర్యమే. ఈ మాటలతో విశ్వనాథం తల్లీకొడుకుల దగ్గరకు వచ్చాడు.

కాలేజి లెక్చరరుగా ఆయనకు ఆ జిల్లాలోనే మంచి పేరుంది. జరిగిన సంగతి వాళ్ళకు చెప్పడంతో వాళ్లకు నవ్వు ఆగలేదు.

''సరేలే, అయితే అయింది. నువ్వెళ్లి బ్రష్ చేసుకురా, టిఫిన్ చేద్దువుగాని'' అంటూ టిఫిన్ ఏర్పాట్లలో మునిగింది అరుంధతి.

★ ★ ★

''ఇంకా మార్కెట్ గురించే ఆలోచిస్తున్నావా అభీ'' తండ్రి గొంతు వినపడ్డంతో పరధ్యానంగానే ''ఊ'' అన్నాడు.

''వదిలేయరా, ఇప్పుడేమయింది, టిఫిన్ చేసి గ్రౌండ్‌కు వెళ్లి ఆడుకో''

''లేదు నాన్నా..ఈరోజు మార్కెట్‌లో ఏదైనా అమ్ముతాను''

ఆశ్చర్యపోయిన విశ్వనాథం అంతలోనే తేరుకొని-

''ఏం అమ్ముతావురా?'' అని ప్రశ్నించాడు.

''నీ క్రికెటు బ్యాటు, వికెట్లు అమ్మేయరా, గొడవ తగ్గుతుంది'' అంది అరుంధతి నవ్వుకుంటూ.


''లేదమ్మా, నేను సీరియస్‌గానే చెపుతున్నాను'' ఏదో అనబోతున్న అరుంధతిని వారించాడు విశ్వనాథం. ఆయనకు అభిపట్ల సహజంగా వుండే మమకారమే కాకుండా ఒక ప్రత్యేకమైన ఇష్టముంది. అభి ఒక్క చదువులోనే కాకుండా బ్యాడ్మింటన్, క్రికెట్‌లో కూడా ముందుంటాడు. మొన్నీమధ్య ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్‌లో కరాటేలో మొదటి బహుమతి కూడా గెలిచాడు. నిరంతరం ఏదో నేర్చుకోవాలనే అభి తపన చూస్తే విశ్వనాథానికి ముచ్చటేస్తుంది. అందుకే అభి ప్రయత్నానికి అడ్డు చెప్పదలుచుకోలేదాయన.

''సరేరా, నీ ఇష్టం, కానీ జాగ్రత్త. ఏదైనా అవసరం వుంటే కాలేజీకి రా''

ఎంసెట్ కోచింగ్‌లో తలమునకలయివున్న విశ్వనాథం టిఫిన్ ముగించి కాలేజీకి బయలుదేరాడు.

''నువ్వు చెప్పమ్మా, ఏం అమ్మాలో''

''నాకేం తెలుసురా. అయినా ఇవన్నీ ఎందుకు నాన్నా, హాయిగా ఇంటిపట్టున వుండక'' అంది



అరుంధతి.

★ ★ ★

''ఏం అమ్ముతావు అభీ'' అడిగాడు గోపి. గోపీ అభికి స్నేహితుడు.

''అదే అర్థం కావడం లేదు'' అన్నాడు అభి.

''ఏదయినా జనాలకు బాగా కావాల్సింది అమ్మాలి'' అన్నాడు గోపి.

''బాగా కావాల్సింది అంటే''

''డిమాండ్ బాగా వున్న వస్తువులు అమ్మితే లాభం ఎక్కువ వస్తుంది'' అనుభవం వున్నవాడిలా చెప్పాడు గోపి.

అన్యమనస్కంగానే గ్రౌండ్ వదిలి మార్కెట్ వైపు కదిలాడు అభి. సమయం 11 గంటలు కావస్తుంది. 'తన స్థలం' దగ్గర్లో వున్న చెట్టునీడన కూర్చున్నాడు. సూర్యకిరణాలు పడి మిలమిల మెరుస్తున్న త్రిశూలం ఠీవిగా నిలబడి వుంది. తదేకంగా దాని వైపే చూస్తున్నాడు అభి. 'అవును, తను కూడా ఏదైనా అమ్మాలి' అనుకున్నాడు. కానీ ఏం అమ్మాలనే నిర్ణయానికి రాలేకపోతున్నాడు. ఇంతలో తమ కాలనీలోనే వుంటున్న కృష్ణమూర్తి మార్కెట్‌లో వున్న అభిని చూసి-

''ఏం అభి, ఇక్కడ కూర్చున్నావు'' అని అడిగాడు.

కృష్ణమూర్తి వాళ్ళ అబ్బాయి విశాల్ అభి క్లాస్‌మేట్. విశాల్‌కు రాకుండా కాలేజ్ ఫస్టును అభి ఎగరేసుకుపోయాడని అభిమీద కొంత మంటగా వుందాయనకు. జరిగిన విషయం చెప్పి, ఏదైనా అమ్మాలనుకుంటున్నట్లు చెప్పాడు అభి.

''ఒక పని చెయ్యవోయ్. తలపై రూపాయి పెట్టుకొని నిలుచో. ఎవడైనా రెండు రూపాయలకైనా కొనకపోడు'' చాలా గొప్పగా మాట్లాడాననుకుంటూ అక్కడి నుండి కదిలాడు కృష్ణమూర్తి.

★ ★ ★

సమయం: మధ్యాహ్నం 2 గంటలు.

''ఎంతవరకూ వచ్చింది అభి, నీ మార్కెట్ కథ'' భోజనానికి ఇంటికి వచ్చిన విశ్వనాధం కొడుకును అడిగాడు.

''అక్కడే వుంది నాన్నా, నాకేం తోచడం లేదు''

ఆలోచనలతోనే భోజనం పూర్తిచేసి బెడ్ పై వాలాడు అభి. లేచేసరికి టైమ్ మూడు దాటుతోంది.

''మార్కెట్‌కేనా అభి'' హడావుడిగా రెడీ అవుతున్న అభిని చూసి ప్రశ్నించాడు విశ్వనాథం.

''అవును నాన్నా'' సమాధానమిచ్చాడు అభి.

''ఏదైనా నిర్ణయానికి వచ్చావా?''

''ఊఁ''

''ఏం అమ్ముదామనుకుంటున్నావురా?''

''డబ్బులు''

''డబ్బులా?'' ఆశ్చర్యంతో అడిగాడు విశ్వనాథం.

''మార్కెట్‌లో స్థలం కొన్నానంటావు. డబ్బు అమ్ముతానంటావు. నీకేమయినా పిచ్చి పట్టిందా?'' కోపంగా అరిచింది అరుంధతి.

తనేం చెయ్యాలనుకుంటున్నదీ వాళ్లకు వివరించి, కరాటే టోర్నమెంట్‌లో తనకు వచ్చిన వెయ్యి రూపాయలను జేబులో పెట్టుకొని మార్కెట్‌కు బయలుదేరాడు అభి.

★ ★ ★

''నీ పెట్టుబడి అంతా నీ సొంత డబ్బులేనా?'' తన పక్కన వున్న బత్తాయి కాయల ఆసామిని అడిగాడు అభి.

''లేదు బాబూ.. నెలకు రెండు, మూడు వేలు అప్పుతెచ్చుకుంటాం. సరుకు కొని నెల రోజులు అమ్మి, అసలు, వడ్డీ కట్టాక మిగిలింది మాకు''

''తరువాత..?''

''ఏముంది..మళ్లీ కొత్తగా అప్పు. మళ్లీ కొనడం, అమ్మడం ఇలా గడుస్తుంది''

''ఎంత వడ్డీ పడుతుంది?''

''నూటికి పది వరకూ పడుతుంది బాబూ.

**శ్రీధర్ భద్రంరాజు**

ఇక్కడ మార్కెట్‌లో రామ్‌లాల్ అనే వాడు వున్నాడు. ఇంకే దారి లేక వాడి దగ్గరే తీసుకోవాల్సి వస్తుంది''

''నేను ఇంకో పద్ధతి చెపుతాను. నీకు నచ్చితే చేద్దువుగాని''

''ఏంటి బాబూ అది?''

## చురకత్తి

**సినిమా ఇండస్ట్రీలో అవకాశాలు ఎంత త్వరగా వస్తాయో అంత త్వరగా దూరమైపోతుంటాయి. 'హీరోయిన్స్ మడికట్టుకు కూర్చుంటే అవకాశాలు రావు. వచ్చిన అవకాశాల్ని నిలబెట్టుకోవాలంటే కొన్ని త్యాగాలు చేయాలి' అంటోంది లారాదత్తా. మొన్నామధ్య ఎక్స్‌పోజింగ్‌కి నేను దూరం అని చెప్పిన లారా ఇలా రెండు నాల్కల ధోరణితో మాట్లాడడంతో మీడియాతో పాటూ సినీజనం కూడా ఆమెని విమర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఇలా ప్రతిస్పందించింది. స్విమ్‌సూట్‌లో నటిస్తే ఎక్స్‌పోజింగ్ అనీ, లేకుంటే సాదాసీదా ఉన్నావని అంటారు. అందం అనేది రెండు వైపులా పదునైన కత్తిలాంటిది. దానిని సరిగా వాడుకోకపోతే అసలుకే మోసం రావచ్చు' అంటూ కొత్త బాణీ ఎత్తుకుంటోంది.**

''నేను ప్రతిరోజు సాయంత్రం నీకు 95 రూపాయలిస్తాను. తరువాత రోజు నువ్వు సరుకు కొని, అమ్ముకొని నాకు 100 రూపాయలివ్వు. ఇలా నీకు ఐదు రూపాయల వడ్డీ మాత్రమే పడుతుంది. ఏరోజుకారోజు ఇచ్చేయడంతో నీకు పెద్దగా కష్టం వుండదు. పైగా నీకు ఇష్టం వున్న రోజు, ఓపిక వున్నరోజు అమ్ముకోవచ్చు. లేని రోజు మానేయవచ్చు. ఏమంటావు'' అడిగాడు అభి.

''బాగానే వుంది బాబూ, కానీ రామ్‌లాల్ సంగతి?''

''ఆ విషయం నేను చూస్తాను కానీ, నువ్వు ఏమంటావు?''

''నాకిది బావుంది బాబూ''

అభి మరికొంతమందిని ఒప్పించి, వారి వివరాలు కనుక్కొని పదిమందికి 95 రూపాయల చొప్పున ఇచ్చాడు. మరుసటిరోజు వారి వద్ద నుండి 100 రూపాయలు తీసుకున్నాడు. వ్యాపారులకు ఈ పద్ధతి బావుండటంతో మరికొంత మంది ఆసక్తిగా తెలుసుకుంటున్నారు. ఇలా రెండు రోజులు గడిచాయి. ఆరోజు సాయంత్రం రామ్‌లాల్ రానేవచ్చాడు.

''ఎవడ్రా ఇక్కడి అభి అంటే'' అక్కడి వారిని అడగడంతో వారు అభిని చూపించారు.

''నువ్వా, వేలెడంత లేవు, నీకెందుకురా ఇవన్నీ. రేపటి నుంచి మార్కెట్‌కు రాకుండా ఇంట్లో పడుకో'' అంటూ కాలర్ పట్టుకున్నాడు. అభి మెరుపు వేగంతో రామ్‌లాల్ రెండు చేతులు వెనక్కి విరిచి పట్టుకొని-

''ఈ గొడవలు, కొట్టుకోవడాలు, ఇవేమీ వద్దు. నీ వెనక బలం ఎంత వుందో, నా వెనక బలం ఎంత వుందో నిరూపించుకుందాం.



ఎవరికి మద్దతు తక్కువ వుంటే వాళ్లు ఈ మార్కెట్ నుండి తప్పుకోవాలి. నిన్ను నమ్మినవాళ్లను నువ్వు తీసుకురా. నన్ను నమ్మిన వాళ్లు నా వెంట వస్తారు. రేపు ఇదే టైమ్‌కి, ఇక్కడే తేల్చుకుందాం'' అంటూ చేతులు వదిలేశాడు.

★ ★ ★

ధర్మయుద్ధంలో విజయం ఎవరి పక్షాన నిలుస్తుందో చూసి వెళదామనే ఆసక్తితో వున్నట్లు ఆరు కావస్తున్నా సూర్యుడు ఇంకా పూర్తిగా అస్తమించలేదు. కొంతమంది స్నేహితులు, తన పట్ల అభిమానం వున్నవాళ్లు సుమారు ఇరవైమంది వరకూ అభి వెంట వున్నారు. విశ్వనాథం, అరుంధతి కూడా అక్కడే వున్నారు.

ఇంతలో రామ్‌లాల్ పాతికమంది మనుషులను వెంటబెట్టుకుని వచ్చాడు. ఉక్రోషంతోనో, సూర్యకిరణాలు అభి మొహంపై పడడం వల్లనో అతని వదనం ఎర్రదనాన్ని సంతరించుకుంది. కండబలం కంటే నైతిక బలం గొప్పదని నమ్మిన అతడు ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నాడు. ఈ ఓటమి సిద్ధాంతానికా, లేక వ్యక్తికా అని ప్రశ్నిస్తున్నట్లు బలమైన గాలి కెరటం అభిని తాకుతూ వెళ్లింది.

ఇంతలో బత్తాయిపళ్ల ఆసామి లేచి, నెమ్మదిగా నడుచుకుంటూ అభి వెనుక నిల్చున్నాడు. అతని తరువాత ఒకరొకరుగా దాదాపు నలభైమంది వ్యాపారస్థులు అభికి అండగా నిలిచారు.

ఓటమిని ఒప్పుకోలేని రామ్‌లాల్ ఆవేశంగా అభి మీదకు వెళ్లబోయాడు. పక్కనే వున్న అనుచరుడు ఒకడు-

''వదిలేయన్నా, కాలేజీ పోరడు. రెండు నెల్లాగితే ఇక్కడ వుండడు. నువ్వు పరేషాన్ కాకు. పైగా మార్కెట్ సపోర్ట్ అంతా వాడికే వుంది. కొంత కాలం ఓపిక పట్టు'' అనడంతో కొంత సమాధాన పడ్డట్టున్న రామ్‌లాల్ నెమ్మదిగా వెనక్కు తిరిగాడు. అభి వైపు హర్షాతిరేకాలు మిన్నుముట్టాయి.

''ఒక్క రెండు నెలలు'' రామ్‌లాల్ మార్కెట్ వదిలి వెళుతూ అనుకున్నాడు. కానీ ఆ క్షణంలో అతనికి తెలియదు..

అనుకోకుండా మొదలైన ఆ చిన్న వ్యాపారం రాబోయే సంవత్సరాల్లో 'అభిజిత్ క్యాపిటల్స్ లిమిటెడ్' పేరున శాఖోపశాఖలుగా విస్తరించుకుంటుందని.